# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 25 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## క్రమశిక్షణ కమిటీకి కొండాసురేఖ వ్యవహారం





## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే
# అంతే సంగతులు

- ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం
- ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు



న్యూఢిల్లీ,ఆగస్ట్24 :అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరిం చింది. హోర్ముజ్ జల సంధి విషయంలో ఉద్రిక్త తలు కొనసాగు తున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేం దుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్ర మే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరి ంచారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉంద న్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్ష లను ఎదుర్కొం టామని స్పష్టం చేస్తోంది.

మిగతా 2లో..

## తెలంగాణ పెట్టుబడులను
# అడ్డుకునే కుట్ర

- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- సమావేశంలో సిఎం రేవంత్ మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 24: పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూ ర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్క రించిం దని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహ కరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అ యితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నా యని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక



పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమం త్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మం త్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు.

## సింగరేణిని కాపాడుకుంటూ..
# లాభాల బాటలో నడిపిస్తాం



- సింగరేణికి ఉజ్వల భవిష్యత్తుకై క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు!
- బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి
- ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడు కుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అం దించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశర చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతి నిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో

మిగతా 3లో..

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం




- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్
- కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్

మిగతా 3లో..

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు
# మెరుగుపరచాలి

- ప్రభుత్వానికి మానవహక్కుల కమిషన్ ఆదేశాలు

హైదరాబాద్,ఆగస్ట్24 : తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లుఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యా ర్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతు లకు హాజరవుతున్నారంటూ ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు అందాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మం డలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొ న్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న



సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావర ణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది. మిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధా న కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖా ధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది. అలాగే ఈ అంశాన్ని తెలంగాణ

మిగతా 2లో..

## అవినీతి అధికారులపై
# ఏసీబీ కొరడా




- నిర్మల్‌లో ఇద్దరు, యాదాద్రిలో ఎసిబికి చిక్కిన నలుగురు
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఎసిబి అధికారులు

నిర్మాల్/యాదాద్రిభువనగిరి,ఆగస్ట్24 : వేర్వేరు చోట్ల నలుగురు అధికారులు ఎసిబికి చిక్కారు. వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు పన్నుల శాఖాధికారులు ఏసీబీ కి పట్టుబడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం పన్నుల శాఖ నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు నుంచి రూ. 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎస్‌టీవో కొప్పెల గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృ ష్ణను ఆదిలాబాద్ రేంజ్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధిన ఆడిట్ లెక్కల వ్యవహారంలో అనుకూలంగా నివేదికను తయారు చేయాలని మంచి ర్యాల పట్టణానికి చెందిన జువెల్లరి దుకాణపు యజమాని లక్కింశెట్టి వీర భాస్కర రావు ఎస్టీవో అధికారులను సంప్రదించాడు. దీంతో ఇద్దరు అధికా రులు మొదల లక్ష రూపాయలు డిమాండ్ చేసి చివరకు రూ. 50వేలకు ఒప్పందం చేసుకున్నారు.అనంతరం ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం ఇద్దరు అధికారులను

# శాసనసభ కమిటీలకుఎంతో ప్రాధాన్యం



- ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి
- బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి
- శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్

హైదరాబాద్, ఆగస్టు 24: ప్రజాస్వామ్య వ్య వస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధా న్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేం దర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానీటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సల హాలు సూచనలు అందించాలన్నారు. మైనారి టీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షే మం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి

మిగతా 3లో..

# మాజీమంత్రి కారుమూరి అరెస్ట్


- ఎపి లిక్కర్ కేసులో అదుపులోకి తీసుకున్న ఇడి
- కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు తరలింపు

మిగతా 3లో..

# అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థు నుంచి దూకిన యువతి

- అక్కడిక్కడే మృతి... దర్యాప్తు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 24: హైదరా బాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మ రణానికి పాల్పడిం ది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కా నూర్‌కు చెందిన సోను పురుషోత్త మన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు.



భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉం టున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చు ంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవర ణలోకి దూకేసింది. దీంతో అక్కడిక క్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిం చారు. మహిళ బలవన్మరణానికి గల కార ణాలను విశ్లేషిస్తు న్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడి తోనూ మా ట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోం దని.. దీనికి మందులు వినియోగిస్తు న్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమా చారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు

- ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన
- ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం

మిగతా 2లో..



# ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు



- అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్న ఎన్ఐఎ

మిగతా 3లో..

# సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె




## వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే

న్యూఢిల్లీ,ఆగస్ట్24 : దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

# హెచ్ఎండిఎ కమిషనర్‌తో రఘునందన్ రావు భేటీ



- పెండింగ్ రోడ్డు, రైల్వే పనుల పూర్తికి అభ్యర్థన

హైదరాబాద్, ఆగస్టు 24: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది. పటాన్‌చెరు ఎగ్జిట్-3 నుంచి ఎగ్జిట్-4, సుల్తాన్‌పూర్ మధ్య పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. కొల్లూరు ఎగ్జిట్-2 వద్ద పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

# ప్రైవేట్ సంస్థలకు ఇస్రోలో స్థానం

- ఇస్రో భవిష్యత్‌పై జైరామ్ రమేశ్ ఆందోళన




న్యూఢిల్లీ,ఆగస్ట్24 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మిం చుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహ నాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల కృషితో ఇస్రో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలను, మౌలిక వసతులను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచ స్థాయి ప్రతిభను భారత్‌కు ఆకర్షించేలా బలమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇస్రో క్రమంగా ప్రయోగ వాహనాల తయారీ, సాధారణ ఉపగ్రహాల తయారీ నుంచి దూరమవుతున్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు

- ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన
- ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం



చెన్నై,ఆగస్ట్24 : తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

# ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

## బెసెంట్ కీలక ప్రకటన


వాషింగ్టన్,ఆగస్ట్24 : ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందని, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం. అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటి వరకు చేపట్టని అతిపెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లూ ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్. హయాంలో ఆ శకం ముగిసింది. టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకారం అందిస్తోన్న దేశాలు తీవ్ర పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ప్రతి సంస్థ, ఏజెన్సీని తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక యుద్ధం సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్కాట్ బెసెంట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఛాంపియన్ షిప్ వేడుకల్లో అపశృతి

## హోంమత్రి అనితకు డ్రోన్ తాకి స్వల్ప గాయం

తిరుపతి,ఆగస్ట్24 :అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రారంభ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది.బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోవడంతో డ్రోన్ కిందపడిపోయింది.హోంమంత్రి వంగలపూడి అనితపై డ్రోన్ కూలింది. దీంతో మంత్రి కుడి చెయ్యిపై స్వల్ప గాయమైంది. వెంటనే అప్రమత్తమైనవైద్య సిబ్బంది.అనితకు చికిత్స అందజేశారు. ఒక్కసారిగాడ్రోన్‌కూలడంతోకొద్దిసేపుఅక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది.

# తల్లిదండ్రులను చంపిన యువతి ఆత్మహత్య



- వారికిచ్చిన్న మత్తుమందుతో తనూ బలవన్మరణం

సంగారెడ్డి,ఆగస్ట్24 : జనవరిలో ప్రేమించిన ప్రియుడి కోసం తల్లిదండ్రులకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హతమార్చిన సురేఖ అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులను పొట్టనపెట్టుకున్న మత్తు ఇంజెక్షన్‌తోనే తన ప్రాణం కూడా తీసుకుంది. వివరాల్లోకెళితే...వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని యాచారం గ్రామానికి చెందిన సురేఖ సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సమయంలో ఓ యువకుడిని ప్రేమించింది. తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పగా.. వారు నిరాకరించారు. ప్రేమ పెళ్లి కుదరదని వారించారు. దీంతో తల్లిదండ్రులపైనే ఆగ్రహం పెంచుకున్న సురేఖ ఇంజెక్షన్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి వారిని కడతేర్చింది. తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోయినట్టు చిత్రీకరించే ప్రయత్నం చేసింది. అయితే.. పోలీసులకు సురేఖపై అనుమానం రావడంతో దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. ఈ కేసులో అరెస్టైన సురేఖ కొన్ని రోజుల క్రితమే జైలు నుంచి బయటకి వచ్చింది. తిరిగి సంగారెడ్డికి వెళ్లిన ఆమె.. శాంతినగర్‌లో ఓ ప్రేవేట్ హాస్టల్లో బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# హర్యానాలో దిగ్భ్రాంతికర ఘటన

## భర్తను చంపి పేగులూడదీసిన భార్య



చండీఘడ్,ఆగస్ట్24 : హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన ఒక దిగ్భ్రాంతికర హత్య కేసు వెలుగులోకి వచ్చింది. ఒక మహిళ తన భర్తను చంపి, అతడి పేగులు బయటకు తీసి దారుణానికి పాల్పడింది. ఆ తర్వాత ఇంటి యజమాని చూశాడనే భయంతో భయాందోళనకు గురై ఇంటి పైకప్పు మీది నుంచి కిందకు దూకేసింది. ప్రస్తుతం ఆమె హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. కురుక్షేత్రలోని పెహోవా రోడ్డులో ఉన్న రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేష్, విమలా దేవి ఓ అ÷-దదె ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల రాజేష్, విమలా దేవి ఏదో విషయమై గొడవపడ్డారు. ఆ గందరగోళాన్ని విని ఇంటి యజమాని రింకు డాబా మీదకు పరుగెత్తాడు. అక్కడ అతడు చూసిన దృశ్యం అచ్చం క్రైమ్ సినిమాలోని సన్నివేశంలా ఉంది. రాజేష్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడి శరీరం నుంచి బయటకు వచ్చిన పేగులను విమల ఒక సంచిలో పెడుతోంది. ఇంటి యజమానిని చూడగానే ఆ మహిళ భయాందోళనకు గురైంది. వెంటనే టెర్రస్ పై నుంచి కిందకు దూకేసింది. గాయపడిన నిందితురాలిని ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స జరుగుతోంది. పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పదునైన ఆయుధాలతో రాజేష్ పొట్టను సుమారు 35 సెంటీమీటర్ల మేర కోసి, లోతైన గాయాలు చేసినట్లు పోస్ట్‌మార్టంలో తెలిసింది. ఘటనా స్థలం నుంచి మూడు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# యువతే దేశ భవిష్యత్‌కు కీలకం

## 20వేల మంది యువతతో మాటామంతీ: కోటంరెడ్డి

నెల్లూరు,ఆగస్ట్24 : స్వామి వివేకానంద, శ్రీశ్రీ చెప్పినట్టు యువత పాత్రే దేశానికి కీలకమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేడు యువత.. దేశ భవిష్యత్తు కోసం ఆలోచిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులన్న తేడా లేకుండా యువత రాజకీయ నాయకులను ప్రశ్నిస్తోందని.. ఇది మంచి నిర్ణయమని.. దీన్ని తాను కూడా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 20 వేల మంది జెన్‌జీ యువతతో 55 రోజుల పాటు 51 చోట్ల మాటామంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం ఉదయం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి.. దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలపై చర్చ నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నో వ్యయప్రయాసలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిపై చర్చ ఉంటుందన్నారు. యువత ఉద్యోగాలకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపుతో తీసుకొచ్చిన కంప్యూటర్ వలనే ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. మాటామంతి కార్యక్రమంలో బహిరంగంగా మాట్లాడలేని వారికి ఫోన్ నంబర్, మెయిల్ ఐడి ద్వారా తనతో చర్చించవచ్చని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

# వెంటిలేటర్ పేలి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

## ముగ్గురు నవజాత శిశువుల మృతి

ముంబై,ఆగస్ట్24 : మహారాష్ట్రలోని అమరావతిలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. అమరావతి జిల్లా మహిళా ఆస్పత్రిలో మంటలు చెలరేగి ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రి మూడో అంతస్తులోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో 39 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. అయితే, తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో వెంటిలేటర్ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి.నిమిషాల్లో ఎల్ఎన్సీయూ మొత్తం వ్యాపించాయి. దీంతో పొగ పీల్చడం, తీవ్రమైన కాలిన గాయాలు కారణంగా ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే వైద్యులు, నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది వార్డుకు చేరుకుని చిన్నారులను కాపాడారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురు నవజాత శిశువులను చికిత్స నిమిత్తం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

# కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

- దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖ లైన పిటిషన్లపై విచారణ జరిగింది.ప్రభుత్వం తరపు న్యాయవా దులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడిం చింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరా యం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

## (మొదటిపేజీ తరువాయి)


# లాభాల బాటలో నడిపిస్తాం

సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ-అసైన్ చేసిన తాడిచర్ల-2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ -2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండ టంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి ఃఔఒ లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అను గుణ ంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్ లో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43,000 నుండి 45,000 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలాముందుకు వెళ్లాలన్నారు. 100 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నతస్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ మరియు నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని ఆయన గుర్తుచేసుకున్నారు. సింగరేణి మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్టాత్మకమైన సంస్థ అని అభివర్ణించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిభట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల -2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. అదే సమయంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆర్ఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను సంస్థ చేజార్చుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ -2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించుకుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ కూడా సింగరేణి దక్కించుకోవడంలో ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సాధించిన మరో విజయమన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చరిత్రాత్మకమన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల వందల మంది లబ్ధిపొందారన్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అన్ని ఏరియాలకు సంబంధించిన గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటు న్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాక రించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవ మానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీ లు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపిం చారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిప డ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నా రని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభు త్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానిం చారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టిం చారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంక ల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివ ర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరి స్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిం దని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణా లు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవ డమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్య టన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజే స్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నిం చారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్న చూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యట నను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేద న్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబం ధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటు న్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అను మతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాసనసభ కమిటీలకుఎంతో ప్రాధాన్యం



అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికా రుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభు త్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభు త్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాల న్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లా డుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహి ంచానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా-జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లి ములు, క్రిష్టియన్లు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నా రు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యు న్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్
- కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్



మెదక్,ఆగస్ట్24 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్టానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి

- ప్రాథమికి సౌకర్యా కూడా మృగ్యం
- యువత ఎలా చదువు సాగిస్తుంది
- మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజిత్ దీప్కే లేఖ



న్యూఢిల్లీ,ఆగస్టు 24 : ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారు ణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథ మిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు. ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్యశాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరు ద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయిం చారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపా లని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేం దుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూ డా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయు లకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్ప గించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శు భ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం కోసం కాదని.. ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# క్రమశిక్షణ కమిటీకి కొండాసురేఖ వ్యవహారం



- ఇందులో ఎవ్వరు ఇక మాట్లాడొద్దు
- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు
- రాజకీయ వ్యవహారాలపై ప్రజాపతినిధులతో రేవంత్ చర్చ



హైదరాబాద్, ఆగస్టు 24: కాంగ్రెస్ పార్టీ నియ మాలకు నేతలం తా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పం దించారు. పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసు కుం టుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందు బాటులో ఉన్న మంత్రులు, ఎం పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమా వేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లా డొద్దని.. ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధిం చిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్‌అండ్ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామ న్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజె క్టులు పూర్తి కావన్నారు. భూసే కరణ, ఫారెస్టు క్లియరె న్సులకి సంబంధించి నిధు లను వెంటనే మంజూరు చేయడానికి ప్రభు త్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మా యి, మందల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , , రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.



# నకిలీ డిఎస్పీగా ప్రజలకు టోపీ

- రూ.1.20 కోట్లు వసూళ్లు
- వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 24: నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ. 1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలు వురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నా రా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికా రులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనం తరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు



## అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్న ఎన్ఐఎ

పెద్దపల్లి,ఆగస్ట్24 :పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లిం కులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానం తో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజా మిల్‌ను ఎన్ఐఎ అధికారులు.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అతడి కార్యకలాపాలు, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

# కాకినాడ బీచ్‌లో ఇద్దరు యువకుల గల్లంతి

## ఆందోళన వ్యక్తం చేసిన డిప్యూటి సిఎం పవన్

అమరావతి,ఆగస్ట్24:కాకినాడలోని గుర్రాల బీచ్ వద్ద అలల ఉధృతి కారణంగా ఇద్దరు యువ కుల గల్లంతుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల గల్లంతుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృం దాలు, మెరైన్ పోలీసు, కోస్టు గార్డుతో పాటు స్థానిక మత్స్యకార సమూహాల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమా చారం అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. ఆదివారం నలుగురు స్నేహితులు వీరబాబు, శ్రీగణెలిష్ సాయిరాం, యువ కిశోర్, ఆదిత్య వెంకట సందీప్‌కుమార్ కలిసి కాకినాడాలోని గుర్రాల బీచ్‌కు వెళ్లారు. ఎవరూ లేని ప్రదేశంలో నలుగురు కలిసి సముద్రంలో స్నానానికి వెళ్లగా అలల ఉధృతికి యువ కిశోర్, వీరబాబు గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు.గల్లంతైనఇద్దరికికోసంముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

## సంపాదకీయం

# ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే పక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ఫ్రీ డయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిల్ల వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభాకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళు ... బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పులు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పుడు ప్రలే నిలదీయాలి. అప్పుడైనా చలనం వస్తుందేమో చూడాలి.

# ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

- ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేలా ప్రణాళికలు
- టర్కీ నుంచి ఆయుధాలు సేకరిస్తున్నట్లు అనుమానాలు
- మక్కా ఒప్పందలోకి ఇరాన్‌కు ఆహ్వానం



న్యూఢిల్లీ, ఆగస్టు 24 : ఆపరేషన్ సిందూర్ తరవాత పాకిస్తాన్ తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతర్జాతీయంగా ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. మొత్తంగా పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా. ..అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది.ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన ఎ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది. మరోఇవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇంకా పలు దేశాలు ఈ మక్కా ఒప్పందం లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందంలో చేరాలని ఇరాన్ కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానం పై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలకనేత మెహ్దీ రహీమీ పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ విదేశాంగశాఖ ఈ ఆహ్వానాన్ని ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాంటప్పుడు ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లి ఉంటుందా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య జరిగిన సంయుక్త రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. నాటో కూటమి మాదిరిగానే 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా అది తమందరిపై జరిగిన దాడిగా మిగిలినవి భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం పశ్చిమాసియాలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఈ ప్రాంత దేశాలు అమెరికా రక్షణ ఛత్రం నుంచి క్రమంగా బయటకు రావాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇరాన్ ఈ ఒప్పందంలో చేరితే.. హూతీలపైనే దాడులు చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ ఆహ్వానం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

# మహారాష్ట్రలో మరో వైద్యుడిపై దాడి కలకలం

### రోగిని పరీక్షస్తుండగా కుమారుడి దాడి



ముంబై,ఆగస్ట్24 : మహారాష్ట్రలో వైద్యుడిపై దాడి మరోసారి కలకలం రేపింది. థానేలోని కల్యాణ్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడిపై అతని కుమారుడు దాడికి పాల్పడ్డాడు. డాక్టర్‌ను దుర్భాషలాడుతూ కొట్టడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ మహిళా వైద్యురాలితో పాటు ఆస్పత్రి సిబ్బందిపై శివసేన కార్పొరేటర్ రమేశ్, అతని అనుచరులు దాడికి పాల్పడటం తెలిసిందే. ఆ దాడి సంచలనం సృష్టించిన కొన్ని రోజులకే తాజాగా మరో ఘటన జరగడంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో దేశ్‌ముఖ్ అనే రోగిని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ యోగేంద్ర జైస్వాల్ పరీక్షిస్తున్నారు. అతని పక్కటెముకకు గాయం కావడంతో చికిత్సా విధానం, బ్యాండేజ్ ఎలా వేయాలి, మందులు ఎలా వాడాలనే విషయాలను జైస్వాల్ వివరిస్తున్నారు. ఈ సమయంలో రోగి కుమారుడు ఒకే ప్రశ్నను పదేపదే అడుగుతూ అభ్యంతరకర భాషను ఉపయోగించాడు. దీనిపై డాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో 'నువ్వేమైనా పెద్ద డాక్టరువా?' అంటూ రోగి కుమారుడు ప్రశ్నించినట్లు జైస్వాల్ వెల్లడించారు. అనంతరం బయటకు వెళ్లి తనను దూషించాడని, తాను అభ్యంతరం చెప్పడంతో తిరిగి వచ్చి దాడి చేశాడని ఆరోపించారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని ఇంకా అరెస్టు చేయలేదు. ఇటీవలే డొంబివ్లిలోనూ ఓ వైద్యురాలిపై దాడి ఘటన కలకలం రేపింది. కల్యాణ్-డొంబివ్లి ప్రాంతానికి చెందిన శివసేన కార్పొరేటర్ రమేశ్.. ఓ మహిళా వైద్యురాలిపై దాడి చేయడం సంచలనమైంది. కార్పొరేటర్, ఆయన అనుచరులు ఆస్పత్రి సిబ్బందిపైనా దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వరుస దాడులతో వైద్యుల్లో ఆందోళన నెలకొంది. తమకు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.

# భారీగా వైద్య సేవలు



### మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

అమరావతి,ఆగస్ట్24 : వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. రాష్ట్రంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని పుష్కర ఘాట్లకు భక్తులు పోటెత్తనున్నారు. దీంతో వారికి భారీ స్థాయిలో వైద్య సేవల అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏర్పాట్లపై సోమవారం రాజధాని అమరావతిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మొత్తం 525 పుష్కర ఘాట్లలో 1,110 వైద్య శిబిరాలతోపాటు 30 ఫీల్డ్ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం 30,000 మందికి పైగా వైద్య సిబ్బందిని నియమించనున్నారు. అదే విధంగా అంబులెన్స్‌ల కోసం ప్రత్యేక గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తారు. 2027, ఏప్రిల్ 30 నాటికి ఈ నిర్మాణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంగా మంత్రి నిర్దేశిరచారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.






# గినియాలో కూలిన డంపింగ్ యార్డు

### ప్రమాదంలో 30 మంది దుర్మరణం

న్యూఢిల్లీ,ఆగస్ట్24 : పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది. మృతిచెందిన 30 మందిలో ఇప్పటివరకు 18 మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారనే అనుమానంతో రక్షణ బృందాలను రంగంలోకి దించినట్టు గినియా ప్రభుత్వం తెలిపింది. అయితే.. అక్కడ ప్రమాదం జరిగే అవకాశమున్నట్టు తాము ముందే ఊహించామని, స్థానికులను వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవలే ఆదేశించామని చెప్పింది.

# తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

### పవిత్రోత్సవాలతో మరింత వైభవంగా తిరుమల

తిరుమల,ఆగస్ట్24 : తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. మరోవైపు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుంగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.









# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

## ఒకే ప్రమాదంలో నలుగురు మృతి బాధాకరం..

## -ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

బలగం టీవీ,వేములవాడ:

చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.సోమవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పరామర్శించి ఓదార్చారు. మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రానికి చెందిన షాదుల్లా కుటుంబ సభ్యులు వివాహ వేడుకకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన రక్తసంబంధీకులు నలుగురు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. మృతుల్లో షాదుల్లాతో పాటు ఆయన భార్య హాసీనా, మరో హాసీనా, పదో తరగతి చదువుతున్న చిన్నారి ఉన్నారని తెలిపారు. ప్రమాదం అనంతరం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఒక్కొక్కరుగా మృతి చెందడం బాధాకరమన్నారు.ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ముందు, వెనుక సీట్లలో ప్రయాణించే వారంతా సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు.ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి ఒక్కరూ తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకుని సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను బాధ్యతగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# బాలికల పట్ల అసభ్య ప్రవర్తన.. నిందితుడికి ఐదేళ్ల జైలు..

## - ఎస్పీ మహేష్ బి. గితే

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:



మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎస్పీ మహేష్ బి. గితే తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ డ్యాన్స్ అకాడమీలో డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేసిన జంగ్లి రఘు మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా, అప్పటి సిరిసిల్ల సీఐ ఉపేందర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు .దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చెయ్యగా, పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో ఆధారాలను సమర్పించడంతో పాటు మొత్తం ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా,శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా తెలిపారు .సమాజంలో నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ముఖ్యంగా బాలలు, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని తెలిపారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి సిరిసిల్ల సీఐ ఉపేందర్, ప్రస్తుత సీఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. జాన్సీ, కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికలను ప్రత్యేకంగా అభినందించారు.



# పెన్షన్ కోసం గీత కార్మికులకు ఐడీ కార్డుల పంపిణీ

## -అర్హులైన గీత కార్మికులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి..

## -ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

బలగం టీవీ, ఇల్లంతకుంట:

ఇల్లంతకుంట మండల కేంద్రంలో 11 మంది గీత కార్మికులకు పెన్షన్ దరఖాస్తుల కోసం గీత కార్మిక ఐడీ కార్డులను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాస్ సోమవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన అర్హులైన గీత కార్మికులు ఐడీ కార్డులు కలిగి ఉంటే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి గీత కార్మికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై బత్తిని ప్రణీత్ గౌడ్, ఇల్లంతకుంట గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్ గౌడ్, కోశాధికారి ముంజ భాస్కర్, సారా రమేష్, కొయ్యడ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



# మతసామరస్యంతో పండుగలు జరుపుకోవాలి

## -సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మతసామరస్యం, సోదరభావంతో పండుగలు జరుపుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. సోమవారం సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయంలో మిలాద్ ఉల్ నబీ పండుగను పురస్కరించుకుని డీఎస్పీ నాగేంద్రచారి మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ ప్రజల్లో సమన్వయం పెంపొందించేందుకు ఆయా మతాల పెద్దలు కృషి చేయాలని కోరారు. పండుగ ఏ మతానిదైనా సామరస్యం, సోదరభావం సమాజంలో మంచి సంబంధాలను పెంపొందిస్తాయని తెలిపారు. మిలాద్ ఉల్ నబీ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలగకుండా మతపెద్దలు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తులపై పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారని, ఎవరైనా గొడవలకు పాల్పడేలా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, మతపెద్దలు పాల్గొన్నారు.

# వైఐఐఆర్ఎస్ పనుల్లో వేగం పెంచాలి

## -కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్ఎస్) నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో విద్యా, సంక్షేమ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.చందుర్తి మండలం మూడపల్లిలో నిర్మిస్తున్న వైఐఐఆర్ఎస్ పనులకు కూలీల సంఖ్య పెంచి శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 16 పీఎం శ్రీ పాఠశాలలు, 13 కేజీబీవీలు, 283 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, టాయిలెట్లు, మరమ్మతు పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు 32 భవనాలు పూర్తికాగా, 92 నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో డీఈఓ మొండయ్య, సీపీఓ శ్రీనివాసాచారి, సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్



నిఖిత, ఈఈలు, ఏఈలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలి

కౌమారదశ విద్యార్థులకు శారీరక, భావోద్వేగ వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, స్వీయ రక్షణ తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జీసీ ఈఏఎస్సి క్లబ్‌లపై విద్యా, సంక్షేమ, పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

విద్యార్థులకు లింగ సమానత్వం, మానసిక ఆరోగ్యం, చట్టపరమైన అవగాహన, సైబర్ భద్రత, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, జీవన నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వంపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో జీసీ ఈఏఎస్సి క్లబ్‌లు, ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసి బాలురు, బాలికలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు.బాల్య వివాహాలు, వేధింపులు, సైబర్ నేరాలను గుర్తించి అధికారులకు సమాచారం అందించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని విద్యా సంస్థల్లో అత్యవసర ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని, పదో తరగతి అనంతరం డ్రాప్‌అవుట్ లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, డీఈఓ మొండయ్య, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ కలుపు మొక్కల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి..

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

విదేశీ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్థానిక జీవవైవిధ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో విదేశీ ఆక్రమణ మొక్కల గుర్తింపు, నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమానికి ప్రతీకగా రూపొందించిన 'థంబ్స్ డౌన్' సంకేతాన్ని అధికారులు, సిబ్బంది ప్రదర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విదేశీ మొక్కల వ్యాప్తిని అడ్డుకుని వాటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్థానిక పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. విదేశీ కలుపు మొక్కల నిర్మూలన, జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో




అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఈకో ఫాన్ సొసైటీ సీఈఓ మెట్టుసాయి సంపత్, రాష్ట్ర సమన్వయకర్త తలారి విక్రమ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..



## -ఎస్పీ మహేష్ బి. గితే

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 21 ఫిర్యాదులను ఎస్పీ మహేష్ బి. గితే స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సత్వర పరిష్కారం పొందేందుకు గ్రీవెన్స్ డే మంచి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# నారీ శక్తికి ప్రతిరూపంగా చేనేత చీర..


## ఐడీఓసీలో మహిళల విజయగాథలపై నేసిన చీర ప్రదర్శన..

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

నారీ శక్తికి ప్రతిరూపంగా, దేశ మహిళల విజయాలను ప్రతిబింబించేలా చేనేత కళాకారులు నేసిన వినూత్న చీరను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన చీర, వివిధ ప్రభుత్వ పథకాలు, శాఖల వివరాలు ప్రసారం చేసేందుకు, సందర్శకులు, చిన్న పిల్లలు వీక్షించేందుకు ఏర్పాటు చేసిన టెలివిజన్ ను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ప్రారంభించారు.



నారీ శక్తి, దేశ రక్షణలో మహిళల ధైర్యసాహసాలను ప్రతిబింబించే ఆపరేషన్ సింధూర్, ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచ కప్ టోర్నమెంట్ లో ఉత్తమ ప్రతిభ చూపిన సురుచి సింగ్, మహిళల, అంధుల క్రికెట్ కప్, 2వ మహిళల కబడ్డీ వరల్డ్ కప్, పారా ఆర్చరీ ఛాంపియన్ శీతల్ దేవి, భారత అథ్లెట్ జ్యోతి యర్రాజీ చిత్రాలను చేనేత కళ ద్వారా ఆవిష్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మహిళా సాధికారతను, దేశ మహిళల విజయాలను స్థానిక చేనేత ప్రతిభకు అద్దం పట్టేలా చీరపై నేయడం అభినందనీయం అని, మహిళల ప్రతిభ, ధైర్యం, విజయాలను సమాజానికి చాటి చెప్పేలా ఈ చీర రూపొందించడం గొప్ప విషయమన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల వివరాలు, ఇతర వివరాలను ప్రసారం చేసేందుకు సందర్శకులు, చిన్న పిల్లల సౌకర్యార్థం టెలివిజన్ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ వెంకట మాధవ రావు, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీఏఓ అఫ్జల్ బేగం, తదితరులు ఉన్నారు.




# లింగంపేట రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

## -ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశం

బలగం టీవీ, వేములవాడ

మండలంలోని లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ప్రమాదం జరిగిన తీరు, రహదారి పరిస్థితులు, ఇతర సాంకేతిక అంశాలపై ఆరా తీసిన ఎస్పీ,అన్ని కోణాల్లో విచారణ చేపట్టి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తును వేగవంతం చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.ఇక్కడ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ తదితర పోలీసు అధికారులు ఉన్నారు.






# బంధనకల్‌కు రెగ్యులర్ ఏఈఓను వెంటనే నియమించాలి..

బలగం టీవీ,ముస్తాబాద్:

మండలంలోని బంధనకల్ గ్రామానికి రెగ్యులర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను వెంటనే నియమించాలని మాజీ ఉప సర్పంచ్ కస్తూరి కార్తీక్ రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఏఈఓ ద్వారా వ్యవసాయ శాఖ సేవలు కొనసాగుతున్నప్పటికీ, గ్రామంలో అధిక సంఖ్యలో రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.పంటల సాగు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, పంటల నమోదు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు తదితర అంశాల్లో రైతులకు సకాలంలో సలహాలు, సేవలు అందాల్సి ఉందన్నారు. రెగ్యులర్ ఏఈఓ లేకపోవడంతో వ్యవసాయ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బంధనకల్ గ్రామానికి వెంటనే రెగ్యులర్ ఏఈఓను నియమించాలని ఎంపీడీఓ, తహసీల్దార్ , సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను ప్రజావాణి ద్వారా కోరినట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వ వ్యవసాయ సేవలు సక్రమంగా అందేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరుపేదలకు తప్పని తిప్పలు



**అద్దెకు ఉంటున్న వారికి మొండి చేయి**
**– ఎల్-3 నుంచి ఎల్-1లో చేర్చాలని బాధితుల వేడుకోలు**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హత ఉన్నప్పటికీ అధికారుల జాబితాల కారణంగా తమకు అన్యాయం జరుగుతోందని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన పలువురు నిరుపేద కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వారు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అద్దె ఇళ్లలో నివసిస్తున్న తమ పేర్లు ఎల్-3 జాబితాలో ఉండటంతో ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా చూపుతున్నారని బాధితులు తెలిపారు. సొంత ఇల్లు, స్థలం ఉన్న వారి పేర్లు ఎల్-1 జాబితాలో ఉన్నాయని, ఎల్-3లో ఉన్నవారి పేర్లను ఎల్-1 జాబితాలోకి మార్చిన తర్వాతే వారు అర్హులవుతారని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు అర్హత ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌ల నిర్వాకం కారణంగా తమ పేర్లు అర్హుల జాబితాలో లేకుండా పోయాయని ఎర్ర గీత, పోచంపల్లి కృష్ణవేణి, యాద లత, దిమ్మటి కవిత, తమ్మనవేణి సతీష్ కుటుంబాలు ఆరోపించాయి. తమను ఎల్-3 జాబితా నుంచి తొలగించి ఎల్-1 జాబితాలో చేర్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజావాణిలో అధికారులను కోరారు.

తమకు సొంత ఇల్లు లేక అద్దెకు ఉంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం తమలాంటి నిరుపేదలకు ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. బొప్పాపూర్‌తో పాటు మండలంలోని ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్న నిరుపేదలను ప్రభుత్వం అర్హులుగా గుర్తించాలని కోరారు.

తమ పేర్లను ఎల్-1 జాబితాలో చేర్చకపోతే జిల్లా మంత్రులను, కలెక్టర్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 142 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు.

సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 06 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 05 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగు తుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని, అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:**

అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుండగా, ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారుల హాజరును పరిశీలించారు. గత వారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? తదితర అంశాలపై ఆరా తీశారు. చేయూత నూతన పెన్షన్ ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించారు. చేయూత పెన్షన్ కోసం కావలసిన వివిధ ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు త్వరితగతిన అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.



ప్రజావాణిలో ఎంపిడిఓ సత్తయ్య, డిప్యూటి తహసీల్దార్ వేణు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పబ్లిక్ స్థల ఆక్రమణను తొలగించాలి ...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజల అవసరాల కోసం వినియోగంలో ఉన్న స్థలాన్ని ఆక్రమించడంపై అధికారులు తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు వినతి సమర్పించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ 7వ వార్డు పరిధిలోని మున్నూరుకాపు సంఘం సమీపంలో పబ్లిక్ హ్యాండ్‌పంప్ చుట్టూ ఉన్న ప్రజా వినియోగ స్థలాన్ని ఆక్రమించి బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సంబంధిత స్థలాన్ని పరిశీలించి అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌ను తొలగించి, స్థలాన్ని తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా సదరు స్థలం "పబ్లిక్ ప్రాపర్టీ – ప్రజల వినియోగం కోసం" అని సూచించే బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అంతర్జాతీయం



# సెప్టెంబర్ 15లోపు అమెరికాకు తిరిగి రావాలని విదేశీ విద్యార్థులకు వర్సిటీల సూచన

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికాలో కొత్త వలస నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో అంతర్జాతీయ విద్యార్థులు సెప్టెంబర్ 15లోపు దేశానికి తిరిగి రావాలని పలు అమెరికా విశ్వవిద్యాలయాలు సూచించాయి. నిర్ణీత కాలపరిమితితో విద్యార్థి వీసాలను మంజూరు చేసే కొత్త నిబంధనలు సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి.

కొత్త నిబంధనలపై విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తున్నాయి. వెబినార్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిబంధనలపై వివరాలను తెలియజేస్తున్నాయి. ఇప్పటికే అమెరికాలో ఉన్న విద్యార్థులు, సెప్టెంబర్ 15 తర్వాత అమెరికాలోకి ప్రవేశించే విద్యార్థులకు నిబంధనలు వేర్వేరుగా వర్తిస్తాయని వెల్లడించాయి.

నాలుగేళ్లకు పరిమితం కానున్న వీసా స్థితి

కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థి వీసా స్థితికి నాలుగేళ్ల పరిమితితో పాటు పలు ఆంక్షలు విధించనున్నారు. సెప్టెంబర్ 15కు ముందే అమెరికాలోకి ప్రవేశించినవారు లేదా ఆ తేదీన అమెరికాలో ఉన్నవారి ఐ-94 రికార్డులో ప్రస్తుతం ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' కొనసాగుతుంది.

అయితే సెప్టెంబర్ 15, 2026 లేదా ఆ తర్వాత అమెరికాలోకి ప్రవేశించే విద్యార్థులకు నిర్ణీత గడువుతో కూడిన 'అడ్మిట్ అన్‌టిల్ డేట్' నమోదు చేస్తారు.

విద్యార్థులకు హార్వర్డ్ సూచన

సెప్టెంబర్ 15 నాటికి అమెరికాలో ఉండేలా విద్యార్థులు ప్రణాళిక చేసుకోవాలని హార్వర్డ్ ఇంటర్నేషనల్ ఆఫీస్ సూచించింది. ఈ సూచన ఎఫ్-1, జె-1 వీసాలపై క్యాంపస్‌లో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులతో పాటు జె-1 పరిశోధకులకు కూడా వర్తిస్తుంది.

నిబంధనలు అమల్లోకి వచ్చే సమయంలో అమెరికాలో ఉన్న విద్యార్థులు తమ కోర్సు పూర్తయ్యే తేదీ లేదా చదువు అనంతర ఉద్యోగ అనుమతి గడువు ముగిసే తేదీ—ఇవ్వాటిలో ఏది తర్వాత వస్తే అప్పటి వరకు, గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు పొడిగింపు కోసం ప్రత్యేక దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా ఉండే అవకాశం ఉంటుంది.

అయితే సెప్టెంబర్ 15 తర్వాత అమెరికా నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చే విద్యార్థులు కొత్త నిబంధనలకు లోబడి ఉంటారు.

గ్రేస్ పీరియడ్‌లోనూ మార్పులు

ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఎఫ్-1 విద్యార్థులకు 60 రోజుల, జె-1 వీసాదారులకు 30 రోజుల గ్రేస్ పీరియడ్ కొనసాగనుంది. కొత్త నిబంధనల ప్రకారం ఎఫ్-1 విద్యార్థుల గ్రేస్ పీరియడ్‌ను 30 రోజులకు తగ్గించనున్నారు.

సెప్టెంబర్ 15 తర్వాత అమెరికాలోకి తిరిగి ప్రవేశించే విద్యార్థులు, పరిశోధకుల ఐ-94లోని 'అడ్మిట్ అన్‌టిల్ డేట్'ను వారి కోర్సు ముగింపు తేదీకి అనుగుణంగా మార్చే అవకాశం ఉందని హార్వర్డ్ ఇంటర్నేషనల్ ఆఫీస్ తెలిపింది. ఇది భవిష్యత్‌లో వీసా స్థితి పొడిగింపులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

పలు వర్సిటీల నుంచి హెచ్చరికలు

చికాగో, జార్జ్‌టౌన్, ఒహియో స్టేట్ తదితర విశ్వవిద్యాలయాలు తమ విద్యార్థులు, పీహెచ్‌డీ పరిశోధకులు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో ఉన్న పూర్వ విద్యార్థులకు కూడా సూచనలు పంపాయి.

సెప్టెంబర్ 8న తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతర్జాతీయ విద్యార్థులు అంతకంటే ముందే న్యూయార్క్ నగరానికి తిరిగి రావాలని కొలంబియా విశ్వవిద్యాలయం సూచించింది.

నిబంధనలపై కోర్టును ఆశ్రయించిన సంస్థలు

కొత్త వీసా నిబంధనలను నిలిపివేయాలని కోరుతూ ఎనిమిది సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. నిబంధనలను ఖరారు చేసే ముందు వాటి ప్రభావాలను అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ సమగ్రంగా పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు వాదించారు. సెప్టెంబర్ 15న నిబంధనలు అమల్లోకి రాకముందే ఈ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# భారత్–రష్యా ఆర్థిక బంధంపై జైశంకర్–పుతిన్ చర్చలు

బలగం టీవీ, మాస్కో

భారత్–రష్యా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సోమవారం మాస్కోలో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారం, వాణిజ్యం, ఇంధనం, ఎరువులు, అణు సహకారం తదితర అంశాలపై వారు చర్చించారు. రెండు రోజుల రష్యా పర్యటనలో భాగంగా జైశంకర్ ఈ భేటీ నిర్వహించారు.


ఇరు దేశాల ఆర్థిక సహకారం గణనీయంగా పెరిగిందని జైశంకర్ పేర్కొన్నారు. అదే రోజు భారత్–రష్యా అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశం కూడా జరిగిందని, ఆర్థిక సహకారంపై మంచి నివేదిక వచ్చిందని తెలిపారు.

భారత రైతుల అవసరాలు తీర్చేందుకు ఎరువుల సరఫరా

భారత్‌కు ఎరువుల సరఫరాను రష్యా మరింత పెంచుతోందని పుతిన్ తెలిపారు. భారత రైతులు, వ్యవసాయ రంగ అవసరాలను పూర్తిగా తీర్చేందుకు అవసరమైన సహకారం కొనసాగిస్తామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భారత్–రష్యా మధ్య వాణిజ్యం మళ్లీ పెరుగుతోందని పేర్కొన్నారు.

ఐదేళ్లలో నాలుగు రెట్లు పెరిగిన వాణిజ్యం

గత ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వస్తువుల వాణిజ్యం నాలుగు రెట్లు పెరిగిందని జైశంకర్ వెల్లడించారు. 2021–22లో సుమారు 13 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం 2025–26 నాటికి దాదాపు 60 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. అయితే ఇదే సమయంలో వాణిజ్య లోటు కూడా 6.6 బిలియన్ డాలర్ల నుంచి 50 బిలియన్ డాలర్లకు పైగా పెరిగిందని తెలిపారు.



వాణిజ్య లోటును తగ్గించడం ప్రస్తుతం భారత్ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటని జైశంకర్ చెప్పారు. మార్కెట్ ప్రవేశం, సుంకాలు, సుంకేతర అవరోధాల తొలగింపు, చెల్లింపుల వ్యవస్థలను బలోపేతం చేయడం, ఇరు దేశాల వ్యాపార సంస్థల మధ్య సంబంధాలను పెంచడం ద్వారా 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలని భారత్–రష్యా భావిస్తున్నాయని తెలిపారు.

మోదీ శుభాకాంక్షలు తెలిపిన జైశంకర్

ప్రధాని నరేంద్ర మోదీ తరఫున పుతిన్‌కు జైశంకర్ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పుతిన్‌ను కలుసుకోవాలని మోదీ ఆకాంక్షిస్తున్నారని, అనంతరం న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆయనను స్వాగతించనున్నారని చెప్పారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది.

అలాగే రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తోనూ జైశంకర్ భేటీ కానున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు చర్చించనున్నారు. మొత్తంగా జైశంకర్ పర్యటనలో వాణిజ్యం, ఎరువులు, ఇంధనం, అణు సహకారంతో పాటు రానున్న ఎస్‌సీఓ, బ్రిక్స్ సమావేశాలపై దృష్టి సారించారు.

# భారతీయులకు 'షెఫీల్డ్ యూనివర్సిటీ' బంపర్ ఆఫర్: పీజీ కోర్సులపై భారీ రాయితీ!

**7,000 పౌండ్ల (రూ. 8 లక్షలు) ట్యూషన్ ఫీజు స్కాలర్‌షిప్ ప్రకటన**

**ప్రత్యేక దరఖాసు అవసరం లేకుండానే ఆఫర్ లెటర్‌తో అర్హత**

**బలగం టీవీ, హైదరాబాద్**

యూకేలోని ప్రముఖ 'యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్' (University of Sheffield) 2027 విద్యా సంవత్సరానికి గానూ అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. ఈ పథకం కింద ఎంపిక చేసిన దేశాల విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో ఏకంగా 7,000 పౌండ్ల (సుమారు రూ. 8 లక్షలు) వరకు సడలింపు లభించనుంది. భారతీయ విద్యార్థులకు కూడా ఈ వెసులుబాటు అందుబాటులోకి రానుంది.

స్కాలర్‌షిప్ ముఖ్య వివరాలు & అర్హతలు

అర్హత: 2027 సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే ఫుల్-టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ (PG) కోర్సు కోసం విశ్వవిద్యాలయం నుండి ఆఫర్ లెటర్ పొంది ఉండాలి.

నివాస అర్హత: సదరు విద్యార్థి భారతదేశం (లేదా జాబితాలోని ఇతర అర్హత దేశాల్లో) శాశ్వతంగా లేదా కనీసం 3 సంవత్సరాలుగా నివసిస్తూ ఉండాలి. ఫీజుల పరంగా ఓవర్సీస్ (Overseas) విద్యార్థిగా గుర్తింపు పొందాలి.

స్వయం నిధులు (Self Funding): కోర్సు ఫీజులను విద్యార్థులే సొంతంగా చెల్లించే వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఇతర స్పాన్సర్‌షిప్‌లు లేదా ఎక్స్‌టర్నల్ స్కాలర్‌షిప్‌లు పొందుతున్న వారికి ఇది లభించదు.

దరఖాస్తు విధానం: ఈ స్కాలర్‌షిప్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అర్హత కలిగిన విద్యార్థి ఆఫర్ లెటర్ పొంది, రిజిస్ట్రేషన్ పూర్తి చేయగానే నేరుగా ఈ రాయితీ వర్తిస్తుంది.

ముఖ్యమైన నిబంధనలు & మినహాయింపులు

రెండేళ్ల మాస్టర్స్ ప్రోగ్రామ్: రెండేళ్ల కోర్సులో చేరే విద్యార్థులకు మొదటి సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసిన తర్వాతే రెండో సంవత్సరంలో ఈ 7,000 పౌండ్ల స్కాలర్‌షిప్ క్రెడిట్ అవుతుంది.

చివరి తేదీ: అర్హత కలిగిన దేశాల విద్యార్థులు 2027, జూలై 6 సాయంత్రం 4 గంటల లోపు షెఫీల్డ్ యూనివర్సిటీలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి.

మినహాయింపులు: పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులు, ఆన్‌లైన్/డిస్టెన్స్ లెర్నింగ్, క్రాస్‌వేస్ మరియు ఎరాస్మస్ ముండూస్ కోర్సులకు ఈ స్కాలర్‌షిప్ వర్తించదు.

భారత్‌తో పాటు జపాన్, కెన్యా, నైజీరియా, దక్షిణ కొరియా, తైవాన్, థాయిలాండ్, తుర్కియే, వియత్నాం దేశాల విద్యార్థులకు కూడా ఈ అవకాశం అందుబాటులో ఉంది.

# దక్షిణ సూడాన్‌లో ఐరాస శాంతి దళాలపై దాడి.. భారత్ ఖండన

**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణ సూడాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి దళాలపై జరిగిన దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఐరాస శాంతి దళాలపై దాడులు అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ నేరాలుగా పరిగణించే అవకాశం ఉందని ఐరాస దక్షిణ సూడాన్ మిషన్ (యూఎన్‌ఎంఐఎస్‌ఎస్) స్పష్టం చేసింది.

ఆగస్టు 24న యూఎన్‌ఎంఐఎస్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న శాంతి దళాలపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు ఐరాసలోని భారత శాశ్వత మిషన్ సామాజిక మాధ్యమం ద్వారా తెలిపింది. దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఇథియోపియా 'బ్లూ హెల్మెట్' సైనికుడికి నివాళులర్పిస్తూ.. గాయపడిన వారికి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

ఐరాస ప్రాంగణాలు, సిబ్బంది పవిత్రత, భద్రతకు పూర్తి గౌరవం ఇవ్వాల్సిన అవసరాన్ని భారత్ పునరుద్ఘాటించింది. ఐరాస భద్రతా మండలి ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న శాంతి దళాల భద్రతకు అన్ని వర్గాలు హామీ ఇవ్వాలని కోరింది. శాంతి దళాలపై నేరాలకు బాధ్యులను జవాబుదారీగా చేయాలని కోరే ఐరాస భద్రతా మండలి తీర్మానం 2589ను పూర్తిగా అమలు చేయాలని భారత్ పిలుపునిచ్చింది. దాడిపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేసింది.

జోంగ్లే రాష్ట్రంలోని పాజుట్‌కు వెళ్తున్న యూఎన్‌ఎంఐఎస్‌ఎస్ పెట్రోలింగ్ బృందంపై గుర్తుతెలియని సాయుధ వ్యక్తులు దాడి చేసినట్లు ఐరాస మిషన్ తెలిపింది. ఈ ఘటనలో ఇద్దరు శాంతి దళ సిబ్బంది మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురు శాంతి దళ సిబ్బంది, ఇద్దరు దక్షిణ సూడాన్ జాతీయ పోలీసు సిబ్బంది, ఇద్దరు పౌర ఉద్యోగులు ఉన్నారు.ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచడంతో పాటు అత్యవసర సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక శీఘ్ర స్పందన దళాన్ని రంగంలోకి దించినట్లు యూఎన్‌ఎంఐఎస్‌ఎస్ వెల్లడించింది.యూఎన్‌ఎంఐఎస్‌ఎస్ అధిపతి, ఐరాస ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ప్రతినిధి అనితా కికి గ్బెహో ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. శాంతి కోసం పనిచేస్తున్న ఐరాస సిబ్బందిపై ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. దాడికి బాధ్యులను గుర్తించి న్యాయస్థానం ముందు నిలబెట్టేందుకు వేగంగా, సమగ్రంగా దర్యాప్తు జరపాలని సంబంధిత అధికారులను కోరారు.

ఐరాస శాంతి పరిరక్షణ కార్యక్రమాల్లో యూనిఫాం ధరించిన సిబ్బందిని అత్యధికంగా అందిస్తున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం అబియే, మధ్య ఆఫ్రికా రిపబ్లిక్, సైప్రస్, కాంగో, లెబనాన్, మధ్యప్రాచ్యం, సోమాలియా, దక్షిణ సూడాన్, పశ్చిమ సహారా ప్రాంతాల్లో ఐరాస శాంతి కార్యకలాపాలకు భారత్ 4,200 మందికి పైగా సైనిక, పోలీసు సిబ్బందిని అందిస్తోంది. వీరిలో 155 మంది మహిళా సిబ్బంది ఉన్నారు.2026 ఏప్రిల్ నాటికి దక్షిణ సూడాన్‌లోని ఐరాస మిషన్‌లో 1,775 మంది భారత సైనిక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో యూఎన్‌ఎంఐఎస్‌ఎస్‌కు అత్యధిక సైనిక సిబ్బందిని అందిస్తున్న దేశంగా భారత్ నిలిచింది.

# కొలంబో టెస్టులో భారత్ పట్టు





**503/9 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్.. లంక 8/2**
**శతకాలతో చెలరేగిన పడిక్కల్, జురెల్.. రెండు వికెట్లు తీసిన భారత బౌలర్లు**

బలగం టీవీ, హైదరాబాద్

కొలంబో టెస్టులో భారత జట్టు పట్టు బిగించింది. దేవ్‌దత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115 నాటౌట్) శతకాలతో తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించిన టీమిండియా.. శ్రీలంకను ఒత్తిడిలోకి నెట్టింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 503/9 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయగా.. అనంతరం బౌలర్లు రెండు వికెట్లు పడగొట్టారు. వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలగడంతో కొద్ది ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

పంత్, జురెల్ దూకుడు

ఓవర్‌నైట్ స్కోరు 300/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్ అండగా నిలిచారు. లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగిన పంత్ 63 పరుగులతో అర్ధశతకం సాధించగా.. జురెల్ అద్భుత ఇన్నింగ్స్‌తో 115 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో జురెల్ టెస్టుల్లో రెండో శతకాన్ని నమోదు చేశాడు.

టీ విరామం అనంతరం వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. జురెల్ శతకం పూర్తి చేసిన వెంటనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 503/9 వద్ద డిక్లేర్ చేశారు.

లంకకు ఆరంభంలోనే షాక్

భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంకకు భారత బౌలర్లు ఆరంభంలోనే షాక్ ఇచ్చారు. ప్రసిద్ధ్ కృష్ణ లహిరు ఉదార (1)ను ఔట్ చేయగా.. మానవ్ సుతార్ ప్రభాత్ జయసూర్య (2)ను ఎల్‌బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపాడు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. కమీల్ మిశారా (5 నాటౌట్) క్రీజులో ఉన్నాడు.

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కంటే శ్రీలంక ఇంకా 495 పరుగులు వెనుకబడి ఉంది. దీంతో మూడో రోజు భారత బౌలర్లు విజృంభిస్తే మ్యాచ్‌పై మరింత పట్టు సాధించే అవకాశం ఉంది.

# ఇమ్రాన్ ఖాన్‌కు వైద్యం అందించండి

**పాక్ ప్రధానికి 21 మంది అంతర్జాతీయ క్రికెటర్ల లేఖ**
**సంతకాలు చేసిన భారత మాజీ కెప్టెన్లు కపిల్‌దేవ్, గవాస్కర్, వెంగ్‌సర్కార్**

బలగం టీవీ, హైదరాబాద్

జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్‌కు తక్షణమే సరైన వైద్యం అందించాలని 21 మంది అంతర్జాతీయ క్రికెటర్లు పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్‌ను కోరారు. భారత మాజీ కెప్టెన్లు సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఈ లేఖపై సంతకాలు చేశారు. ప్రపంచకప్ విజేత కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్‌కు మానవతా దృక్పథంతో మెరుగైన వైద్యం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి

పాకిస్థాన్ అంతర్గత న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకోవడం తమ ఉద్దేశం కాదని, అయితే ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇమ్రాన్‌కు వైద్య సదుపాయాలు కల్పించాలని క్రికెటర్లు కోరారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ మూడు ప్రధాన అభ్యర్థనలు చేశారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైద్య బోర్డు వైద్యులతోపాటు ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించాలి.



లేఖపై కపిల్‌దేవ్, సునీల్ గవాస్కర్, దిలీప్ వెంగ్‌సర్కార్‌తో పాటు మైఖేల్ అథర్టన్, మైఖేల్ బ్రియర్లీ, నాసిర్ హుస్సేన్, ఆండ్రూ స్ట్రాస్, డేవిడ్ గోవర్, అలన్ బోర్డర్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, స్టీవ్ వా, కిమ్ హ్యూస్, క్లైవ్ లాయిడ్, జాన్ రైట్, అలిస్టెయిర్ కుక్, అర్జున రణతుంగ తదితరులు సంతకాలు చేశారు.

ఇమ్రాన్ ఖాన్ 2018 నుంచి 2022 వరకు పాకిస్థాన్ ప్రధానిగా పనిచేశారు. 2023 నుంచి ఆయన జైలులో ఉన్నారు. ఆయనతో పాటు భార్యకు కూడా 17 ఏళ్ల జైలుశిక్ష విధించినట్లు సమాచారం.

# రూ.5 లక్షల విలువైన వెండి కానుకలు సమర్పించిన భక్తులు..



బలగం టీవీ, పోతుగల్:

పోతుగల్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి, శివకేశవ ఆలయంలో భక్తులు స్వామివారికి సుమారు రూ.5 లక్షల విలువైన వెండి కానుకలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

బాలయ్య గారి తన్నీరు భారతీయ రాజేశ్వరరావు, ఆయన కుమారుడు ప్రసాద్ రావు, సరిత దంపతులు స్వామివారి సేవలో భాగస్వాములయ్యారు. సుమారు 2 కేజీల బరువు కలిగిన వెండి తీర్థ పాత్రలతో పాటు వెండి మంగళహారతి సెట్‌ను ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా పోతుగల్ గ్రామ సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్ దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో కానుకలు సమర్పించిన దాతల కుటుంబంపై శ్రీ సీతారామచంద్ర స్వామివారి, ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. దాతల కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సకల ఐశ్వర్యాలతో ఉన్నత స్థానాల్లో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# టీమ్ ఎంఎంఆర్ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట సర్పంచ్ కు ఘన సన్మానం..



బలగం టీవీ, ఇల్లంతకుంట:

ఇల్లంతకుంట మండల కేంద్రంలో టీమ్ యం యం ఆర్ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ యం.రాజు ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీమ్ యం యం ఆర్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా టీమ్ యం యం ఆర్ సభ్యులు మాట్లాడుతూ.. మండలంలోని సర్పంచుల సమస్యలను సమన్వయం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి యం.రాజు ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధిగా ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలని, సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# సిరిసిల్ల పట్టణ పద్మశాలి యువజన సంఘం నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం..

బలగం టీవీ, సిరిసిల్ల:



సిరిసిల్ల పట్టణ పద్మశాలి యువజన సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సబ్బని హరీష్ సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు సబ్బని హరీష్‌తో పాటు ఆయన వెంట వచ్చిన 3వ వార్డు డైరెక్టర్ కోడం హరీష్, 4వ వార్డు డైరెక్టర్ మానాల అరుణ్ కుమార్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పద్మశాలి యువజన సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ సబ్బని హరీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిందం కళ చక్రపాణి దంపతులు మాట్లాడుతూ.. శ్రీ మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పద్మశాలి యువత ఐక్యతను మరింత బలోపేతం చేయాలని సూచించారు. యువతను వివిధ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సంప్రదాయబద్ధంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పద్మశాలి యువజన సంఘం కార్యకలాపాలను విస్తృతం చేస్తూ సమాజంలో మంచి పేరు సంపాదించడంతో పాటు, ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా యువత ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

# అర్జెంటీనా చేతిలో భారత్ ఓటమి

## 5-3 తేడాతో ఓటమి.. హాకీ ప్రపంచకప్ సెమీస్ రేసు నుంచి నిష్క్రమణ

**రెండో రౌండ్‌లో ఒక్క పాయింట్ కూడా సాధించని టీమిండియా**

బలగం టీవీ, హైదరాబాద్



2026 హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు పోరాటం ముగిసింది. సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన డూ ఆర్ డై మ్యాచ్‌లో భారత్ నిరాశపరిచింది. సోమవారం అర్జెంటీనాతో జరిగిన రెండో దశ మ్యాచ్‌లో 3-5 తేడాతో ఓటమి పాలైంది. దీంతో సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది.

ఆరంభం నుంచే అర్జెంటీనా దూకుడు

పూల్-ఈలో అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మ్యాచ్ ప్రారంభమైన 40 సెకన్లకే టోస్కానీ ఫీల్డ్ గోల్ చేయడంతో అర్జెంటీనా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఏడో నిమిషంలో నికోలస్ డెల్లా టోర్రే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో ఆధిక్యం 2-0కు చేరింది.

10వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో భారత్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. అయితే ఆ తర్వాత భారత జట్టు అదే జోరును కొనసాగించలేకపోయింది. డిఫెన్స్‌లో తప్పిదాలు, పాసింగ్‌లో లోపాలు భారత్‌ను ఇబ్బంది పెట్టాయి.

పెనాల్టీ కార్నర్లు వృథా

రెండో, మూడో క్వార్టర్లలో భారత్‌కు గోల్ అవకాశాలు లభించినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. 34వ నిమిషంలో వరుసగా నాలుగు పెనాల్టీ కార్నర్లు లభించినా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు గోల్ సాధించలేకపోయింది. అర్జెంటీనా డిఫెన్స్ సమర్థంగా అడ్డుకుంది.

చివర్లో రెండు గోల్స్.. అప్పటికే ఆలస్యం

మూడో, నాలుగో క్వార్టర్లలో భారత గోల్‌కీపర్ మోహిత్ అద్భుతమైన సేవ్స్ చేసినప్పటికీ అర్జెంటీనా ఆధిపత్యం కొనసాగింది. యష్‌దీప్ చేసిన ఫౌల్‌తో లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను డొమింగ్యూజ్ గోల్‌గా మలిచాడు.

నాలుగో క్వార్టర్‌లో భారత్ వరుసగా రెండు గోల్స్ చేసి ఆశలు రేపింది. అయితే అప్పటికే సమయం మించిపోవడంతో మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది. చివరకు 3-5 తేడాతో ఓటమి తప్పలేదు.

రెండో రౌండ్‌లో ఒక్క పాయింట్ కూడా లేదు

రెండో రౌండ్‌లో భారత్ పూర్తిగా విఫలమైంది. అర్జెంటీనాతో మ్యాచ్‌కు ముందు నెదర్లాండ్స్ చేతిలో 1-3 తేడాతో ఓడింది. అంతకుముందు తొలి రౌండ్‌లో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలవడంతో భారత్‌కు క్యారీ పాయింట్లు దక్కలేదు. దీంతో రెండో రౌండ్‌లో ఒక్క పాయింట్ కూడా సాధించకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

51 ఏళ్లుగా అందని ప్రపంచకప్

హాకీ ప్రపంచకప్ చరిత్రలో భారత్ ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే టైటిల్ సాధించింది. 1975లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు.. ఆ తర్వాత 51 ఏళ్లుగా మరోసారి ట్రోఫీని ముద్దాడలేకపోయింది. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తూ ఆశలు రేకెత్తించిన భారత్.. ఈ ప్రపంచకప్‌లోనూ భారీ అంచనాలతో బరిలోకి దిగింది. అయితే రెండో దశలో వరుస పరాజయాలతో ఆ ఆశలు ఆవిరయ్యాయి.

మహిళల జట్టుకూ నిరాశే

మరోవైపు భారత మహిళల జట్టు కూడా హాకీ ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. పూల్-ఈలో ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌ను భారత్ 0-0తో డ్రా చేసుకుంది. దీంతో స్టేజ్-2 ముగిసే సమయానికి భారత్, చైనా, ఆస్ట్రేలియా చెరో రెండు పాయింట్లతో సమంగా నిలిచాయి. మెరుగైన గోల్స్ ఆధారంగా ఆస్ట్రేలియా రెండో స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు చేరింది. ఇదే గ్రూప్ నుంచి నెదర్లాండ్స్ అంతకుముందే సెమీస్‌కు అర్హత సాధించింది.

# జైస్వాల్—ఫెర్నాండో గొడవపై ఐసీసీ చర్యలు

**ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత**
**చెరో డీమెరిట్ పాయింట్ నమోదు**

బలగం టీవీ, హైదరాబాద్



కొలంబో టెస్టులో టీమిండియా బ్యాటర్ యశస్వీ జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య చోటుచేసుకున్న వాగ్వాదంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీవ్రంగా స్పందించింది. మైదానంలో అనుచిత ప్రవర్తనకు పాల్పడిన ఇద్దరు ఆటగాళ్లపై చర్యలు తీసుకుంది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో చెరో 25 శాతం కోత విధించడంతోపాటు, చెరో ఒక డీమెరిట్ పాయింట్ జత చేసింది.

ఇద్దరూ ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు అంగీకరించారు. ఆటగాళ్ల మధ్య అనుచిత ప్రవర్తన, భౌతికంగా తాకడం వంటి చర్యలకు సంబంధించిన ఈ ఉల్లంఘనను లెవెల్-1 తప్పిదంగా ఐసీసీ పేర్కొంది.

అసలేం జరిగిందంటే..

తొలి రోజు ఆటలో యశస్వీ జైస్వాల్‌ను ఔట్ చేసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహం ప్రదర్శించాడు. పెవిలియన్ వైపు వెళ్తున్న జైస్వాల్‌ను ఉద్దేశించి ఏదో వ్యాఖ్య చేశాడు. దీంతో జైస్వాల్ ఆగ్రహంతో ఫెర్నాండో వద్దకు దూసుకెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది.పరిస్థితి చేయిదాటే అవకాశం ఉండటంతో ఇతర ఆటగాళ్లు వెంటనే జోక్యం చేసుకుని ఇద్దరినీ దూరంగా తీసుకెళ్లారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

జైస్వాల్‌కు జడేజా, భోగ్లే సూచన

ఈ ఘటనపై మాజీ క్రికెటర్లు అజయ్ జడేజా, హర్ష భోగ్లే స్పందించారు. కెరీర్‌లో ఎదుగుతున్న సమయంలో ఇలాంటి వివాదాలకు జైస్వాల్ దూరంగా ఉండాలని జడేజా సూచించాడు. ప్రత్యర్థుల వ్యాఖ్యలను తట్టుకోలేకపోతే, తాను కూడా వారిని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని పేర్కొన్నాడు.

ప్రత్యర్థులు ఎంతగా రెచ్చగొట్టినా ఆటగాళ్లు సంయమనం పాటించాలని హర్ష భోగ్లే సూచించాడు.

భోగ్లే వ్యాఖ్యలకు జైస్వాల్ స్పందన

భోగ్లే వ్యాఖ్యలపై జైస్వాల్ స్పందిస్తూ.. ఘటనలో అసలు ఏం జరిగిందో తెలియకుండా తీర్పులు ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించాడు. ప్రత్యర్థులు హద్దులు దాటితే భారత్ కూడా అందుకు తగిన విధంగా సమాధానం ఇస్తుందని పేర్కొంటూ తన చర్యలను సమర్థించుకున్నాడు.

# లైంగికదాడి కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష..

**- రూ.1,000 జరిమానా విధించిన సిరిసిల్ల 1వ అదనపు జిల్లా కోర్టు..**
**- దర్యాప్తు బృందం, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ మహేష్ బి. గితే.**
**- పోక్సో, అత్యాచారం కేసుల్లో నిందితులకు వరుసగా కఠిన శిక్షలు..**
**- నేరస్తులు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరు: జిల్లా ఎస్పీ**

బలగం టీవీ, సిరిసిల్ల:



పోక్సో, అత్యాచారం కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు, పకడ్బందీగా సాక్ష్యాల సేకరణ, ప్రాసిక్యూషన్‌తో సమన్వయంతో నిందితులకు వరుసగా శిక్షలు పడేలా జిల్లా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడు జంగపల్లి శ్రీహరికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల 1వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పుష్పలత సోమవారం తీర్పు వెలువరించారు.

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన జంగపల్లి శ్రీహరి ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం అప్పటి సీఐ ఉపేందర్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

కేసు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, వెన్నెల సహకారంతో 9 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. జాన్సీ వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడు శ్రీహరికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించింది.

నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టిన అప్పటి సిరిసిల్ల సీఐలు సర్వర్, ఉపేందర్, ప్రస్తుత సీఐ నాగేశ్వరరావు, తంగళ్లపల్లి ఎస్ఐ అశోక్, పీపీ జాన్సీ, కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, వెన్నెలను జిల్లా ఎస్పీ అభినందించారు.

పోక్సో కేసుల్లోనూ జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి, ప్రాసిక్యూషన్‌తో సమన్వయం చేసుకుంటూ వేగవంతమైన విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ తెలిపారు. నేరానికి పాల్పడిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# పెన్షన్ దరఖాస్తులు స్వీకరించి వెంటనే మంజూరు చేయాలి..





బలగం టీవీ, గంభీరావుపేట:

మండల స్థాయి ప్రజావాణిలో వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్ దరఖాస్తులను స్వీకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం మండల ప్రజావాణి నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.


ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల నుంచి పెన్షన్ దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు ఉన్నారని, వారి ఉపాధిపై అనేక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా వృద్ధులు సైతం పెన్షన్‌పై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు.

ప్రస్తుతం పెన్షన్ దరఖాస్తులు స్వీకరించకపోవడంతో అర్హులైన వృద్ధులు, బీడీ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే దరఖాస్తుల స్వీకరణ చేపట్టి, అర్హత కలిగిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఇరిగి సందీప్, చిట్టంపల్లి బిక్షపతి, ఎగదండి అర్జున్, ఎగదండి రవి, ఎండి అజ్మత్, బండ రాజు, దోసల శంకర్, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

CINEMA

# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం




బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది. క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబో తున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.




# వారణాసిపై మరో సంచలన వార్త

వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ అర్టిస్ట్‌లు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది.'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ పక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర




ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.

# 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి





రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. లకైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి' అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.

# విడుదలకు ముందే టాక్సిక్ రికార్డులు




యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ.30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతు న్నాయి. అక్కడ ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ.1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది.

# రాకాలో ఐశ్వర్యలక్ష్మి




## నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగెటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్

